జోరుగా మలాయి చికెన్ దందా !

మలాయి చికెన్ .. గ్రిల్డ్ చికెన్ తెలుసు, కడయ్ చికెన్ తెలుసు ఈ మలాయి చికెన్ ఏంటీ అని ఆలోచిస్తున్నారా? చికెన్‌ను ఫ్రిజ్‌లో ఉంచి వండే సమయం దాటిన తర్వాత వాడకుండా పారవేసే కోడిమాంసాన్నే మలాయి చికెన్ అంటారు. ఇలాంటి మాంసం విషంతో సమానమని, తింటే అనారోగ్యం పాలుకావడం ఖాయమని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అయితే కొందరు వ్యాపారులు తక్కువ ధరకే మలాయి చికెన్‌ను విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు.

– హిందూపురం:

- రోజుల తరబడి నిల్వ చేసిన చికెన్‌ను విక్రయిస్తున్న వైనం
- బెంగళూరు కేంద్రంగా అమ్మకాలు
- తక్కువ ధరకే అంటూ మోసం
- విషంతో సమానమంటున్న వైద్యులు




బెంగళూరు నుంచి తీసుకువచ్చి మేళాపురం వద్ద షెడ్‌లో ఉంచి మలాయి చికెన్, ముక్కలుగా చేసి కబాబ్ విక్రయదారులకు ఇవ్వడానికి ఉంచిన మలాయి చికెన్

బెంగళూరులోని స్టార్ హోటల్స్, పెద్ద చికెన్ షాపుల వారు రోజూ పెద్ద ఎత్తున చికెన్ విక్రయాలు చేస్తుంటారు. అయితే హోటల్స్‌లో వండటానికి ఫ్రిడ్జ్‌ల్లో భద్రపర్చినవి, షాపుల్లో మిగులు చికెన్‌ను సమయం దాటిన తర్వాత పారవేయాలి. అయితే కొందరు స్వార్థపరులు ఇలాంటి చికెన్‌ను సేకరిస్తూ అమ్మడమే వ్యాపారంగా చేసుకున్నారు. మలాయి చికెన్ ఇటీవలి కాలంలో బెంగళూరు నుంచి హిందూపురానికి అధికంగా సరఫరా అవుతోంది.

డీ క్రాస్‌లో దందా...

బెంగళూరు డీ క్రాస్‌లో మలాయి చికెన్ వ్యాపారం పెద్ద ఎత్తున సాగుతోంది. అక్కడ నుంచి వివిధ ప్రాంతాల వారు వాహనాల్లో తీసుకెళ్తుంటారు. టెంపోలలో అతితక్కువ ధరలకు తెల్లవారుజామున తీసుకువచ్చి వాటిని ముక్కలు చేసి తమకు అనుకులమైన చికెన్ దుకాణాలు, కబాబ్ విక్రేతలకు ఇచ్చి డబ్బు సంపాదించు కుంటూ దందా సాగిస్తూ ప్రజల ఆరోగ్యంతో చలగాటం ఆడుతున్నారు.

తక్కువ ధరకే...

మలాయి చికెన్‌ను సాధారణ చికెన్‌తో కలిపి అమ్ముతున్నారు. రోడ్డు పక్కల ఉన్న కొన్ని చికెన్ కబాబ్ వ్యాపారులు చేస్తున్న బండ్లవారికి విక్రయిస్తుంటారు. సాధారణ ధర కన్నా తక్కువ ధరకే చికెన్ అంటూ ప్రజలను ఆకర్షిస్తుండటంతో తేడా తెలిని అనేక మంది మలాయి చికెన్‌ను లాగిస్తూ అనారోగ్యం పాలవుతున్నారు.

ఆ వారాల్లో అమ్మకాల జోరు..

ఫుడ్‌సేఫ్టీ, మున్సిపాల్టీ, పోలీసులు అధికారులు సంయుక్తంగా వరుసగా దాడులు చేయడంతో గతంలో హిందూపురంలో మలాయి చికెన్ వ్యాపారం కనిపించలేదు. అయితే ఇటీవలి కాలంలో మళ్లీ మలాయి చికెన్ దందా జోరుగా సాగుతోంది. ఆది, మంగళ, శుక్రవారాలతో పాటు ఇతర పండుగ సమయాల్లో పెద్ద ఎత్తున మలాయి చికెన్ దిగుమతి చేసుకుని హిందూపురంలోనే కాకుండా పరిసర ప్రాంతాలకు కూడా సరఫరా చేస్తున్నారు.

మలాయి చికెన్ గుర్తించడం ఎలా?

కోడి మెడ అడ్డంగా కోసినప్పుడు రక్తధరలు కనిపిస్తాయి. అలాకాకుండా తెల్లగా పాడిబారినట్లు ఎర్రబడి గట్టిగా ఉంటే అది ఫ్రిజ్ చికెన్. కోడి వింగ్స్ (రెక్కలు) రెండు కోసి వేసి ఉంటాయి. చర్మం కూడా తొలగించి ఉంటారు. చికెన్‌ను పట్టుకుంటే జిగుటగా ఉంటుంది.

అది విషాహారమే..



ఫ్రిజ్‌లో రోజుల తరబడి ఉంచిన చికెన్ విషంతో సమానమే. లిజునేల్లా అనే బ్యాక్టీరియా ఫాం అయి ఉంటుంది. వ్యాధి నిరోధకాల కోసం కోళ్లకు స్టెరైడ్ ఇచ్చి ఉంటారు. చెడిపోయిన కోడి మాంసం తినడం వల్ల కడుపులో అల్సర్, జ్వరాలు, టాక్సిల్ రసాయన వల్ల రియాక్షన్ వచ్చే ప్రమాదం ఉంది. అలాగే కడుపు నొప్పి, వాంతులు, విరేచనాలు, గొంతునొప్పి వంటివి వస్తాయి. ఫంగల్, వైరల్ ఇన్ఫెక్షన్ బారిన పడతారు.

– వెంకటరమణనాయక్, వైద్యుడు, హిందూపురం

క్లుప్తంగా

భూములు పరిశీలించిన సబ్‌కలెక్టర్



భూముల వివరాలు తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్ కార్తీక్

చిలమత్తూరు: మండలంలోని దేమకేతేపల్లి పంచాయతీ ఓబుళాపురంలో మంగళవారం సబ్ కలెక్టర్ కార్తీక్ పర్యటించారు. సర్వే నెం.67లో 18.90 ఎకరాల్లో తాము సాగులో ఉంటున్నామని, వాటికి అసైన్‌మెంట్ పట్టాలు ఇవ్వాలని హసీనా, రామాంజినమ్మ, ముబీనా, గులాబ్ జాన్, నరసమ్మ సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ నేపథ్యంలో మంగళవారం అర్జీదారులు సాగులో ఉన్నారా? లేదా? అనే విషయాన్ని సబ్‌కలెక్టర్ పరిశీలించారు. అయితే అర్జీదారులు ఎవరూ సాగులో లేరన్న విషయాన్ని ఆయన గుర్తించారు.

వాహనాల రాకపోకలకు మార్గం సుగమం



పోచనపల్లి బ్రిడ్జి వద్ద నిర్మించిన మట్టి కట్టపై రాకపోకలు సాగుతున్న దృశ్యం

హిందూపురం: మున్సిపాల్టీ పరిధిలోని 14వ వార్డు పోచనపల్లి గ్రామానికి వెళ్లే దారిలో బ్రిడ్జి కింద నుంచి పెద్ద వాహనాలు, అంబెలెన్స్, ట్రాక్టర్లు వెళ్లే విధంగా పెన్ననది వాగు గుండా మట్టిరోడ్డు ఏర్పాటు పూర్తి చేశారు. కొత్త బ్రిడ్జి నిర్మాణం అయ్యే వరకు వాహనాల వాహనాలు వెళ్లే విధంగా ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ సొంత నిధులతో రహదారి సౌకర్యాన్ని కల్పించారు. ఇప్పటికే టూవీలర్, పాదచారులు వెళ్లేవిధంగా ఐరన్ బ్రిడ్జి ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.

కుష్టు వ్యాధి నివారణపై అవగాహన

గుడిబండ: కుష్టువ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గుడిబండ వైద్యాధికారి సౌందర్య తెలిపారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులకు కుష్టు వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు.

న్యాయం చేయండయ్యా..

పెనుకొండ: ఇంటి పట్టా విషయంలో తనకు న్యాయం చేయాలని పట్టణానికి చెందిన ఓ టీవీ చానల్ విలేకరి భార్య మంజుల బుధవారం తహసీల్దార్‌కు విన్నవించుకున్నారు. మడకశిర రోడ్డులోని జర్నలిస్ట్ కాలనీలో తనకు గతంలో ప్రభుత్వం పట్టా ఇవ్వగా దానిని అన్యాక్రాంతం చేశారన్నారు. విచారించి న్యాయం చేయాలని కోరారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



హోమం నిర్వహిస్తున్న భక్తులు

అమరాపురం: మండల కేంద్రమైన అమరాపురంలో వెలసిన ఆర్య వైశ్యుల ఆరాధ్య దైవం కన్యాక పరమేశ్వరి అమ్మవారి 28వ ఆలయ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అర్చకులు అమ్మ వారికి ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు.

మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం

హిందూపురం: హిందూపురం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావును చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మన్లు జబీవుల్లా, బలరామిరెడ్డి వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఇటీవల ఉత్తమ కమిషనర్‌గా పురస్కారం అందుకున్న కమిషనర్‌కు కౌన్సిలర్ ఈర్షద్ అహ్మద్ ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశం అనంతరం సన్మానించి అభినందించారు.

లక్ష్మీ వేంకటేశా నమో నమః



అలంకరణలో ప్రసన్న లక్ష్మీ వేంకటేశ్వరస్వామి

అమరాపురం: మండల కేంద్రంలో వెలసిన ప్రసన్న లక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అర్చకులు శ్రీనిధి భట్టాచార్యులు స్వామికి ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అంకురార్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు

- ఎమ్మెల్యే శంకరనారాయణ



ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు జయమ్మ. వీరిది సోమందేపల్లి మండల పరిధిలోని చల్లాపల్లి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జయమ్మ కుటుంబం రూ.1,52,468 లబ్ధి పొందింది. వైఎస్సార్ చేయూత రూ.37,500 వైఎస్సార్ పింఛను కానుక రూ.79,750, రైతు భరోసా రూ.34,500 వైఎస్సార్ సున్నా వడ్డీ రూ.1,137 వైఎస్సార్ సున్నా వడ్డీ (డ్వాక్రా) 581 లబ్ధి పొందారు సీఎం వైఎస్ జగనన్న మేలును ఎప్పటికీ మరిచి పోలేమని జయమ్మ తెలిపారు.



చల్లాపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకరనారాయణ

సోమందేపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలనలో అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర నారాయణ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని చల్లాపల్లిలో జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల లబ్ధి గురించి వివరిస్తూ బుక్‌లెట్లను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మూడున్నరేళ్ల కాలంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో లబ్ధి చేకూర్చినట్లు చెప్పారు. గత టీడీపీ పాలనకు ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనకు తేడాను గమనించాలన్నారు. గతంలో జన్మభూమి పెత్తనం ఉండేదని, ప్రస్తుతం వలంటీర్ వ్యవస్థ ద్వారా పార్టీలకు అతీతంగా పథకాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో జగన్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, మాజీ కన్వీనర్ వెంకటరత్నం, సర్పంచ్ సౌజన్య, ఎంపీటీసీ అంజి, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ మురళీకృష్ణ, నాయకులు సత్యనారాయణరెడ్డి, ఈశ్వర్, బాబిరెడ్డి, దాము, రవీంద్రారెడ్డి, రాజు, హరీష్, రామచంద్ర రెడ్డి, అంజినమ్మ, గంగాదర్ గిడ్డారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రారంభం..

చాకర్లపల్లి నుంచి కదిరేపల్లి వరకు రూ.1.40 కోట్లతో నిర్మించిన రోడ్డును ఎమ్మెల్యే శంకర నారాయణ ప్రారంభించారు. అనంతరం గ్రామ సచివాలయ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు.

వాడీవేడిగా 'పురం' కౌన్సిల్ మీట్

- 174.48 కోట్ల బడ్జెట్‌కు ఆమోదం



కౌన్సిల్ మీట్‌లో వైఎస్సార్‌సీపీ, టీడీపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం జరుగుతున్న దృశ్యం

హిందూపురం: హిందూపురం నుంచి రెండుసార్లు ఎమ్మెల్యే అయిన బాలకృష్ణ 2014 నుంచి నేటి వరకు తన గ్రాంటు నుంచి ఒక రూపాయి కూడా మున్సిపాల్టీకి ఇవ్వలేదంటే హిందూపురంపై ఆయనకు ఉన్న అభిమానం కనిపిస్తోందని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ నాగేంద్రబాబు విమర్శించారు. దీంతో టీడీపీ, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ల వాదనల మధ్య మున్సిపల్ కౌన్సిల్ మీట్ వాడీవేడిగా జరిగింది. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం చైర్‌పర్సన్ ఇంద్రజ అధ్యక్షతన, కమిషనర్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో 2023–24 సంవత్సర బడ్జెట్ సర్వసభ్య సమావేశం జరిగింది. ముందుగా రూ.174.48 కోట్లతో సిద్ధం చేసిన బడ్జెట్ అంశాలపై చర్చించి ఆమోదిస్తూ తీర్మానం చేశారు. ఇందులో ప్రారంభ నిల్వ రూ.55.13 కోట్లతో గ్రాంట్లు, జమలతో కలిపి రూ.119.34 కోట్లుగా రుపొందించారు. వచ్చిన రూ.వందలో రూ.32 అప్పులు, మెయిటెనెన్స్, రిపేర్లు, జీతాలకే సరిపోతోందని తేలింది. నాగేంద్రబాబు మాట్లాడుతూ ఎమ్మెల్యే గ్రాంటు ఇవ్వకపోగా గొల్లపల్లి పైప్‌లైన్ కోసం చేసిన సుమారు రూ.65 కోట్లు అప్పుల వడ్డీ, తదితర వాటికి ప్రతినెలా రూ.వందకు రూ.32 వాటికే ఖర్చు చేయాల్సివస్తుంటే ఎక్కడ అభివృద్ధి చేయగలమని ప్రశ్నించారు. ఇటీవల హిందూపురానికి పెళ్లికోసం వచ్చిన ఎమ్మెల్యే బాలకృష్ణ సరస్వతీ విద్యామందిరానికి కంప్యూటర్లు అందించి తాను ఏదో సేవచేస్తున్నట్లు చెప్పుకోవచ్చరని, వాస్తవంగా హెరిటేజ్ కంపెనీ సీఆర్‌సీ నిధులను ప్రజాపయోగ కార్యక్రమాలకు వినియోగించాల్సి ఉండగా దాన్ని ఇలా చూపించారే తప్ప ఆయన చేసిదేముందన్నారు. దీనికి టీడీపీ కౌన్సిలర్లు అడ్డుచెబుతూ ఎమ్మెల్యేకు అనుకులంగా వాదనలకు దిగడంతో చైర్‌పర్సన్ ఇంద్రజ జోక్యం చేసుకున్నారు. రాష్ట్ర ఆర్థిక ఇబ్బందిగా ఉన్నప్పటికీ సీఎం జగన్ అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని గమనించి మాట్లాడాలన్నారు. అనవసరంగా అభివృద్ధి జరగలేదని ప్రతిపక్ష కౌన్సిలర్లు ఆరోపించడం పద్ధతి కాదన్నారు. వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, జబీవుల్లా, కౌన్సిలర్ మల్లికార్జున మాట్లాడుతూ మున్సిపాల్టీలోని 38 వార్డులోనూ వివక్ష చూపకుండా అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నట్లు వివరించారు. కౌన్సిలర్ ఈర్షద్ మాట్లాడుతూ తనవార్డులో రోడ్డు, కాలువ పనులకు 9 నెలల కిందట టెండర్ వేసి అమోదం తెలిపినా ఇంతవరకు చేయలేదని ఆ కాంట్రాక్టర్ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. వెంటనే పనులు ప్రారంభమయ్యేలా చూస్తామని చైర్‌పర్సన్ పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, కమిషనర్ ప్రభాకరరావు తదితరులు

మడకశిర: మడకశిర మున్సిపాలిటీ పరిధిలో సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ తెలిపారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. చైర్‌పర్సన్ మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చేయకూడదన్నారు. ఆయా వార్డుల్లో కౌన్సిలర్లు సమస్యలను తెలుసుకుని అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. అధికారులు కూడా కౌన్సిలర్లు చెప్పిన సమస్యలను వెంటనే పరిష్కరించడానికి చొరవ తీసుకోవాలని కోరారు. పట్టణంలో ప్రధానంగా తాగునీటి సమస్యపై అధికారులు దృష్టి సారించాలన్నారు. అలాగే పారిశుధ్యం పనులు చేపట్టి ఎక్కడా చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కమిషనర్ ప్రభాకరరావు మాట్లాడుతూ మున్సిపాలిటీలో సమస్యలను పరిష్కరించడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నామని తెలిపారు. పారిశుధ్యం పనులను పూర్తిస్థాయిలో చేపట్టేలా అదనంగా దినసరి కూలీ ప్రాతిపదికన కార్మికులను తీసుకుంటామన్నారు. 11, 13 వార్డుల్లో తాగునీటి సమస్యను పరిష్కారానికి రూ.7 లక్షల నిధులు మంజూరు చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎస్ఎఫ్‌సీ నిధులతో పలు సీసీ రోడ్ల నిర్మాణానికి కౌన్సిలర్లు ఆమోదం తెలిపారు. అలాగే పట్టణంలోని వివిధ మార్కెట్లకు సంబంధించిన పన్నులు వసూలు చేయడానికి అవసరమైన టెండర్లు పిలవడానికి కూడా కౌన్సిల్ ఆమోద ముద్ర వేసింది. సమావేశంలో వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, వైస్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మమ్మ, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

పథకాలు సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణప్ప

పావగడ: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని పిల్లలకు మెరుగైన విద్య అందించి ఉన్నత ఉద్యోగాలు పొందేలా తీర్చి దిద్దాలని ఎమ్మెల్యే వెంకటరమణప్ప రైతులకు సూచించారు. తాలూకాలోని నిడుగల్ హోబళి తూమకుంటె గ్రామంలో 75వ అమృత మహోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం నిర్వహించిన అరసికెర వంక జలానయన అభివృద్ధి కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. వ్యవసాయ పథకాల గురించి ఎప్పటికప్పుడు రైతులకు సమాచారం అందించాలని వ్యవసాయ శాఖాధికారులకు సూచించారు. ఏడీ విజయమూర్తి , అరసికెర గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు మంజుల తదితరులు పాల్గొన్నారు.

'జోడో అభియాన్ 'ను జయప్రదం చేయండి

హిందూపురం టౌన్: కాంగ్రెస్ ఆధ్వర్యంలో చేపడుతున్న హాత్ సే హాత్ జోడో అభియాన్‌ను జయప్రదం చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సుధాకర్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ... ఈ నెల 3, 4, 5 తేదీల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గౌతమ్ జిల్లాలో నియోజకవర్గాల వారీగా సమీక్ష నిర్వహించి, జోడో యాత్రకు అనుసంధానంగా దిశా నిర్దేశం చేస్తారన్నారు. అనంతరం కరపత్రికలు విడుదల చేశారు. అనంతరం స్థానిక రైతు బజార్ సమీపంలో నూతన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు.

ఘనంగా సర్వోదయ దినోత్సవం

పావగడ: స్థానిక స్వామి వివేకానంద గ్రామీణ సంఘటిత ఆరోగ్య కేంద్రంలో సర్వోదయ దినోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆరోగ్య కేంద్రం నిర్వాహకుడు స్వామి జపానంద గాంధీజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సుమారు 85 మంది కుష్టు రోగులకు వైద్య చికిత్సలు నిర్వహించారు. ఔషధాలు, పాదరక్షలు, కంబళ్లు, నూతన వస్త్రాలు, శానిటేజర్ కిట్లు పంపిణీ చేశారు. వైద్య నిపుణులు డా స్నేహ కులకర్ణి, అరవింద్ కులకర్ణి, అప్పాజి భానుమతి తదితరులు పాల్గొన్నారు.

గ్రానైట్ రాళ్లకు పూజ

రొద్దం: మండల కేంద్రంలోని పెన్నానది ఒడ్డున వెలసిన పూరాతన రొద్దకాంబదేవి ఆలయ నిర్మాణానికి ఉపయోగించే గ్రానైట్‌కు మంళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం పెద్దాంజనేయ స్వామి దేవాలయం వద్ద అర్చకులు గిరీష్‌స్వామి ఆధ్వర్యంలో పూజలు చేశారు. అనంతరం గ్రామంలో ఊరేగించి ఆలయ ప్రాంగణానికి తరలించారు.

నేడు ప్రజా వేదిక

మడకశిరరూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం ఉదయం 10 గంటలకు 15వ విడత సామాజిక ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సోనీబాయి తెలిపారు. సామాజిక తనిఖీ వివరాలను వెల్లడిస్తారన్నారు.

కాలిదారి పునరుద్ధరించాలి

పావగడ: పూర్వ కాలం నుంచి ఉన్న కాలి దారిని పునరుద్ధరించాలని రైల్వే అధికారులను డిమాండ్ చేస్తూ తాలూకాలోని కే రాంపురం గ్రామస్తులు మంగళవారం ఆందోళన చేశారు. రాయదుర్గం–తుమకూరు రైల్వే మార్గాన్ని గుర్తించే క్రమంలో కే రామపురం రైల్వే స్టేషన్ వద్ద ఉన్న కాలి దారిని మటు మాయం చేశారని మండిపడ్డారు. విషయం తెలుసుకున్న రైల్వే అధికారులు ఆందోళన కారుల వద్దకు చేరుకుని తప్పనిసరిగా కాలి మార్గాన్ని యథా విధంగా నిర్మిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

పరిగి: మండలంలోని బీచిగానిపల్లిలో బుధవారం ఎమ్మెల్యే శంకరనారాయణ ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి తెలిపారు. ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

నేడు భూమి పూజ..

బీచిగానిపల్లిలో ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్మించనున్న ఇళ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే శంకరనారాయణ భూమి పూజ చేసి పనులు ప్రారంభిస్తారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తెలిపారు.

ప్రయాణికుడి మృతి



బాబయ్య (ఫైల్)

పరిగి: మండలంలోని ధనాపురం వద్ద ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి గుండెపోటుతో చనిపోయాడు. రొద్దం మండలంలోని పెద్దగువ్వలపల్లికి చెందిన బాబయ్య (72) అనే వ్యక్తి డయాలసిస్ కోసం హిందూపురం వచ్చాడు. అనంతరం హిందూపురం నుంచి పెద్దగువ్వలపల్లికి వెళ్లే బస్సులో బయలుదేరాడు. పరిగి మండలంలోకి బస్సు చేరగానే గుండెపోటుతో చనిపోయాడు. మృతునికి ఇద్దరు కుమారులు, భార్య కుళ్లాయమ్మ ఉన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



టీడీపీ నాయకులను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శంకర నారాయణ

సోమందేపల్లి: మండలంలోని చల్లాపల్లిలో మంగళవారం టీడీపీ నుంచి పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీలోకి చేరారు. టీడీపీ సీనియర్ నాయకుడు ఓబుళప్ప గారి నంజిరెడ్డి, శంకర్‌రెడ్డి, నర్సిరెడ్డి, నరసింహారెడ్డి, అంజనరెడ్డి తదితరులకు ఎమ్మెల్యే శంకర నారాయణ వైఎస్సార్‌సీపీ కండువా వేసి ఆహ్వానించారు. టీడీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీలో కొనసాగినా ఎలాంటి మేలు జరగలేదని వారు తెలిపారు. సీఎం జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరామన్నారు.

అంకితభావంతో పనిచేయాలి

గుడిబండ: ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు విధుల పట్ల అంకితభావంతో పనిచేయాలని ఎంఈఓ శ్రీధర్ సూచించారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని తాళికెర, బీ.టీ.పల్లి, మోరుబాగల్, వీరజ్జనపల్లి ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాజరు పట్టికతో పాటు రికార్డులు పరిశీలించారు. అనంతరం కె.కె.పాళ్యం ఉన్నత పాఠశాలలో నాడు–నేడు పనులను పరిశీలించారు.

అవినీతి జరిగితే చర్యలు



ప్రజా వేదికలో పాల్గొన్న పీడీ, అధికారులు

పెనుకొండ: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో అక్రమాలు జరిగితే చర్యలు తప్పవని ఎన్ఆర్ఈజీ పీడీ రామాంజినేయులు పేర్కొన్నారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశపు భవనంలో బుధవారం ఉపాధి పనులకు సంబంధించి ప్రజా వేదిక నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ పెనుకొండ మండలానికి సంబంధించి 2020–21, 2021–22 సంవత్సరాలకు సంబంధించి 14 గ్రామ పంచాయతీల్లో జరిగిన రూ. 23 కోట్ల పనులకు సోషల్ ఆడిట్ నిర్వహించి నేడు ప్రజా వేదిక నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చేసిన పనులు సరిగా లేకపోవడంతో రికవరీ కింద రూ.33,370, పెనాల్టీ కింద రూ.32,892 మొత్తం రూ.65,262 అవినీతి జరిగిందన్నారు. వెంటనే పై మొత్తాన్ని చెల్లించాలని ఆయా ఎఫ్ఏలను పీడీ ఆదేశించారు.

ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు



అలంకరణలో పేట వేంకకటరమణస్వామి

హిందూపురం: పట్టణంలోని పేట వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. మంగళవారం సింహవాహనంపై వెంకటరమణస్వామిని కొలువు దీర్చి పుర వీధులగుండా ఊరేగించారు. అంతకుముందు సుప్రభాత సేవతో శ్రీదేవి, భూదేవి సమేత వెంకటరమణస్వామికి తిరుమంజన సేవ నిర్వహించారు.

నేడు చింత ఫలసాయం వేలం

మడకశిర (అగళి): అగళి మండలంలోని ఇనగలూరు పంచాయతీ పరిధిలోని దొక్కలపల్లి, ఇనగలూరు, తొణసహళ్లి గ్రామాలకు చెందిన చింత ఫలసాయాన్ని బుధవారం ఉదయం 10 గంటలకు వేలం వేయనున్నట్లు గ్రామ కార్యదర్శి ఫణిరాజు తెలిపారు. మధూడి గ్రామ పంచాయతీ పరిధిలోని చింత ఫలసాయాన్ని మధ్యాహ్నం 2 గంటలకు వేలం వేస్తామన్నారు. ఆయా గ్రామ సచివాలయాల వద్ద బహిరంగ వేలం కార్యక్రమం ఉంటుందన్నారు.

ప్రశాంతంగా వాహనాల వేలం



వాహనాలను వేలం వేస్తున్న పోలీసు అధికారులు

గోరంట్ల: మండలంలోని గోరంట్ల పోలీసుస్టేషన్ పరిధిలో ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన 51 ద్విచక్ర వాహనాలతో పాటు కారు, ఆటోకు మంగళవారం గోరంట్ల పోలీసుస్టేషన్ ప్రాంగణంలో వేలం పాట నిర్వహించారు. సెబ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్, సీఐలు సుబ్బారెడ్డి, సుబ్బరాయుడు వాహనాల వేలన్ని పర్యవేక్షించారు. వాహనాల వేలం ద్వారా ప్రభుత్వానికి రూ.9,82,940 ప్రభుత్వానికి ఆదాయం వచ్చినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు.

4న హరేసముద్రం చెరువు వేలం

మడకశిరరూరల్: మండల పరిధిలోని హరేసముద్రం పెద్ద చెరువులో చేపల పెంపకానికి 4న గ్రామ సచివాలయంలో ఉదయం 10.30 గంటలకు సర్పంచ్ కరియన్న, ఈఓఆర్డీ శైలజ సమక్షంలో వేలం పాట నిర్వహిస్తున్నట్లు గ్రామ కార్యదర్శి సావిత్రి తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రూ.10 వేలు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు.

అధికారుల రాకతో దుకాణాల బంద్

అమరాపురం: మండల కేంద్రమైన అమరాపురంలో అమ్మకం పన్ను , లేబర్ అధికారులు వచ్చారంటూ వ్యాపార, వాణిజ్య నిర్వాహకులు తమ దుకాణాలను ఉదయం నుంచి బంద్ చేశారు. కర్ణాటక సరిహద్దులో అమరాపురం మండలం ఉండడంతో ఇక్కడ అమ్మకాలు చేసే సరుకులకు సరైన బిల్లులు లేక పోవడంతోనే అధికారులు వచ్చారన్న విషయం తెలుసుకుని మొత్తం షాపులు మూసివేశారు.